

# కడుపుమంట

శ్రీ మేడిశెట్టి వెంకటరత్నం.

"మీ పాదాలకు మొక్కుతాను బాబూ, కొంచెం నీళ్ళొదలండీ."

"ఆ పప్పులంతా వుడకవోయ్. మామూలు లాంఛనాలు జరుగనిదే బొట్టు నీళ్లుకూడ వొదిలేందుకు లేదు"

"పేదోణ్ణి బాబూ, అప్పడిగినా ఎవరూ యీయలేదు. ముందటి కేమైనా తెచ్చిస్తాను, గింజలమ్మి"

"దొంగ మాటలన్నిని. అప్పియ్యరాసీకు వూళ్ళో అందరుంటే" నాకు టోపీ వేయబోతావ్."

"అయ్యో, నారాయణ, మీబోటి అధికార్ల వద్ద అలా చేస్తామా సామీ. మీరియ్యాలి, మేము తినాలిగాని. దయ వుంచండి బాబూ మలమల మాడిపోతోంది కయ్యా"

"ఏం ప్రయోజనం లేదు, వెళ్లు." అని, తలుపు వేసుకొన్నాడు. ఓటపాళెంఫిర్కా "ఓవర్‌సీర్" తలుపు పగులదన్ని, గొంతు పిసికెయ్యాలనుకొన్నాడు రాముడు దయ అంటే ఏమో ఎఱుగని ఆ దయ్యాన్ని. కాని త్వరపడ వద్దని చెప్పింది తనబుద్ధి.

౨

ఆ దినం రాత్రి నిద్రపట్లేదు రాముడికి. చాపమీద పడుకొని పొల్లుతున్నాడు అదే పనిగా కలత జెందిన మనస్సుతో పాపం. తెలిసిన వాండ్లందరినడిగాడు. ప్రయోజనం లేకపోయింది. ఒక యఖరా కూడా సరిగా లేని మాలని కెవరిస్తా రొక రూపాయి అప్పు. అందుట్లో యీ దినాల్లో. రాత్రికి నీళ్లు పారకపోతే ఎండుగడ్డౌతుంది చేలో పయిరంతా. తలుచుకుంటే కడుపు మండుతుంది రాముడికి పాపం. కాని, ఏంచేయగలడు. తన వంటి వాండ్ల అధో గతిచూస్తూ అట్లే వూరుకొన్న పరమాత్మను నిందించాడు యిష్టమొచ్చినట్లు. మంచి జీతాల్లాగుతూ, ధనికులు చేసే "సప్లయిల"తో తృప్తి జెందక, కూటికి లేని తనబోటి వాండ్లను మామూళ్ల కొరకు పీడించి గడ్డితిను యీ "ఓవర్‌సీర్"లాంటి వుద్యోగస్తులకు త్వరగా చావు రప్పించడమని ప్రార్థించాడు తర్వాత. కానీ నీళ్ళుమాత్రం పారలేదు చేనుకు. వూరుకుంటే ప్రయోజనం లే దనుకొన్నాడు.

3

ఆలోచించాడు రాముడు. మెఱుపుమాదిరి తట్టిందొక "తలంపు" తన మనస్సుకు. తన శరీరాన్ని చూచుకొన్నా డొక్కసారి. సింహాలా వున్నాడు. చేతి కండరాలు చూచుకొన్నాడు. తెల్లరాళ్ళను పిండిజేసేట్లున్నాయి. మంచి గడ్డపార పెట్టాడు భుజాన. దూకాడు గుడిసెలోంచి కండ్లు తెరచినా మూసినట్టుండే అమావాశ్య చీకట్లోకి, గధ భుజానేసుకొని భీముడుజొకినట్లు బకాసురునిమీదికి. "ఓవర్‌సీర్"ను చంపేందుకా?

కల్లుచెట్లల్లోకి తీశాడు దారి. లొట్టెల్ని పగులగొట్టాడు తీసుకొచ్చిన రాళ్లతో ఆక్రిందపడే అమృతాన్ని త్రాగాడు తనివితీర.

కాలువ ప్రక్కన కయ్య కయ్యకు దగ్గర్నే తూము. గడ్డపార బాగానెట్టాడు తూములోకి. రాముడు ఊ... అన్నాడు గడ్డపార వంగింది. శరీరం చెమటలో స్నానం జేసింది. చెక్కలేచింది పైకి 2 అంగుళాల ఎత్తు అయిపోయింది. తెల్లవార్లు పారిపోయాయి నీళ్లు రాముడి కయ్యలోకి.

రాముణ్ణి తీసుక పోయాయి ఎఱ్ఱటోపీలు 'ఆఱునెల్లన్నాడు సబ్ మేజిస్ట్రేట్" దిక్కులేని రాముడిమాట వినేదెవరు?